క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు. మహిళా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కఠినంగా శిక్షించాలి



నిరసన చేస్తున్న ఏఐవైఎఫ్ కార్యకర్తలు

నెల్లూరు(వేదాయపాళెం) : తెలంగాణలో ఆరేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి, హత్య చేసిన మృగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీబొమ్మ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హమాలీ కూలీల ఆరేళ్ల కుమార్తెను పక్క మిల్లులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన 28 ఏళ్ల వినోద్‌మాజీ అనే వ్యక్తి అతిదారుణంగా అత్యాచారం చేసి, గొంతు నులిమి చంపడం సభ్య సమాజం తలదించుకునేలా చేసిందన్నారు. అలాంటి వ్యక్తిని ఉరితీయడంతో పాటు ఆ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షాన్‌వాజ్, షబ్బీర్, వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నాయకులు గౌస్, సర్దార్, బాషా, రియాజ్, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

చలపతి, చెంచయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వేదాయపాళెం) : దివంగత గోను చలపతి, మేకల చెంచయ్యల 26వ వర్ధంతి సందర్భంగా స్థానిక 20వ డివిజన్ నక్కల గుంట ప్రాంతంలో వారి స్థూపం వద్ద సీపీఎం, డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ రూరల్ ఇన్‌చార్జి, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిత్యం పేదల సమస్యలు తీర్చేందుకు గోను చలపతి, చెంచయ్య పోరాటాలు చేశారన్నారు. వారి ఎదుగుదలను చూసి ఓర్వలేని శక్తులు రౌడీ మూకలతో హత్య చేయించారని విమర్శించారు. అమరుల త్యాగ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కిన్నెరకుమార్, కొండా ప్రసాద్, పాటల శీనయ్య, సంపత్‌కుమార్, ఒంగోలు సుధీర్, సురేష్, రమణ, నరసింహ, గోను చైతన్య పాల్గొన్నారు.

కేంద్ర బృందానికి సాదర స్వాగతం



కేంద్ర అధికారులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్డీఓ మలోల

నెల్లూరు(దర్గామిట్ట) : జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయడానికి మంగళవారం నెల్లూరుకు వచ్చిన కేంద్ర బృంద అధికారులకు నెల్లూరు ఆర్డీఓ మలోల పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో వారు బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో నగరంలోని ఓ హోటల్‌లో బస చేస్తున్న కేంద్ర బృంద అధికారులైన మన్ను జీ ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యలకు నెల్లూరు ఆర్డీఓ మలోల పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు.

ఉత్తమ ఫలితాలకు కేరాఫ్

‘కోడూరు గురుకులం’

మండలంలోని కోడూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలయోగి గురుకుల బాలికల కళాశాల జిల్లాస్థాయిలో టాప్‌గా నిలుస్తోంది. రాష్ట్రస్థాయి ఫలితాలతో పాటు జిల్లాస్థాయిలో టాపర్‌లను ఈ కళాశాల అందిస్తోంది. దీంతో జిల్లా నలుమూలల నుంచి విద్యార్థినులను ఇక్కడ చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం కనబరుస్తున్నారు.

- టెన్త్, ఇంటర్మీడియట్‌లలో కార్పొరేట్ ఫలితాలు
- గతేడాది రాష్ట్ర టాపర్‌గా కళాశాల విద్యార్థిని



కోడూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలయోగి గురుకుల బాలికల కళాశాల

తోటపల్లిగూడూరు : పదిహేనేళ్ల కిందట సర్వేపల్లి పేరుతో కోడూరులో గురుకుల పాఠశాల ఏర్పాటైంది. ఐదేళ్ల అనంతరం పాఠశాల జూనియర్ కళాశాలగా మారింది. ఇందులో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో అందుబాటులోకి వచ్చింది. పదో తరగతిలో 80 మంది, ఇంటర్మీడియట్‌లో గ్రూపునకు 40 మంది చొప్పున సీనియర్, జూనియర్ ఇంటర్‌కు సంబంధించి 160 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. ప్రవేశ పరీక్షల ద్వారా ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుంది.

ఫలితాల్లో టాప్

పాఠశాల నుంచి కళాశాలగా మారిన కోడూరు గురుకులం తక్కువ కాలంలోనే జిల్లా స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. విశాలమైన మైదానంలో భవనం, సకల సౌకర్యాలు ఈ కళాశాలకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అలాగే సమర్థవంతమైన ప్రిన్సిపల్స్, అంకితభావం కలిగిన అధ్యాపకులు ఉండడంతో ఫలితాల పరంగా జిల్లాలోనే మొదటి స్థానంలో నిలుస్తోంది. జిల్లాలో అనేక గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నప్పటికీ కోడూరు గురుకులంలో అడ్మిషన్ కోసం జిల్లా వాసులు పరితపిస్తున్నారంటే కళాశాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు.

గతేడాది ఫలితాలు ఇలా..

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలు కళాశాల కీర్తిని జిల్లా వ్యాప్తంగా వ్యాపింపజేశాయి. ముఖ్యంగా ఇంటర్మీడియట్‌కు సంబంధించి కళాశాల విద్యార్థిని జి.శరణ్యప్రియ ఎంపీసీ విభాగంలో వెయ్యికి 982 మార్కులు సాధించి రాష్ట్రంలోని గురుకుల కళాశాలలో టాపర్‌గా నిలవడం విశేషం. మొత్తంగా ఇంటర్మీడియట్ ఫలితాల విషయానికొస్తే జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. జూనియర్ ఇంటర్‌లో 81 మంది, సీనియర్ ఇంటర్‌లో 84 మంది పరీక్షలు రాశారు. జూనియర్ ఇంటర్‌లో ఎస్.ప్రవళిక అనే విద్యార్థిని ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గానూ 463 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. అలాగే బైపీసీ విభాగంలో డి.భావన 440 మార్కులకు గానూ 431 మార్కులు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. సీనియర్ ఇంటర్‌కు సంబంధించి జి.శరణ్యప్రియ ఎంపీసీ విభాగంలో 982 మార్కులు సాధించి రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచింది. బైపీసీ విభాగంలో ఈ.శ్రీజ 1000కి 974 మార్కులు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది.

పదో తరగతిలో..

పదో తరగతిలో గతేడాది 79 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 75 మంది ఉత్తీర్ణులై 95 శాతం ఫలితాలు సాధించింది. ఇందులో ఐ.అనూహ్య అనే విద్యార్థిని 568 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. అలాగే కె.నాగమణి అనే విద్యార్థిని 559 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, జె.శరణ్య 543 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది.



982 మార్కులు సాధించిన శరణ్యప్రియ

అధ్యాపకుల కృషి ఫలితమే..



గడిచిన పదేళ్లలో కళాశాల విద్యార్థులు సాధిస్తున్న మంచి ఫలితాల వెనుక కళాశాల అధ్యాపకుల కృషి ఎనలేనిది. అంకితభావంతో కలిగిన అధ్యాపకుల కృషికి తోడు క్రమశిక్షణ కలిగిన కళాశాల విద్యార్థులు పోటీపడి చదువుతూ మంచి మార్కులతో కళాశాలకు పేరు తెస్తున్నారు. భవిష్యత్తులోనూ మెరుగైన ఫలితాలు తెచ్చేందుకు కృషి చేస్తా.

– ఎస్తేరమ్మ, కళాశాల ప్రిన్సిపల్, కోడూరు గురుకులం

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సీపీఎం నాయకుడు చంద్ర రాజగోపాల్



మాట్లాడుతున్న చంద్ర రాజగోపాల్

పొదలకూరు : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ భారీ ఆధిక్యతతో ఎన్డీయే కూటమి ఆంధ్రప్రదేశ్‌లో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. తొలి సంతకంలో పేర్కొన్న హామీలతో పాటు మిగిలిన హామీలను కూడా అమలు చేయాల్సిందిగా కోరారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధిని కొనసాగించాలని, నిత్యావసర, కూరగాయల ధరలను అదుపులోకి తీసుకురావాల్సిందిగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో బి.మనోహర్, కె.పెంచలనర్సయ్య, బాబు, రంగయ్య, స్వర్ణలత, మణి, కాలేషా, పాండు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పొట్టెంపాడు బ్రిడ్జి



దెబ్బతిన్న పొట్టెంపాడు బ్రిడ్జి

- ఊడిపడుతున్న పెచ్చులు

ముత్తుకూరు : మండలంలోని పొట్టెంపాడు వద్ద నక్కలకాలువపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా శిథిలమైపోయింది. అడుగు భాగంలో పెచ్చులూడి ఇనుప కమ్ములు బయటపడుతున్నాయి. పగుళ్లిచ్చి బ్రిడ్జి బలహీనపడుతోంది. దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మాణమైన ఈ బ్రిడ్జి ద్వారా స్థానికులు వెంకటాచలం మండలంలోని పలు గ్రామాలకు ప్రయాణిస్తుంటారు. ధాన్యం బస్తాలతో నిండిన లారీలు, ఎరువుల లోడుతో ట్రాక్టర్లు నిత్యం ఈ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్నాయి. స్థానిక నాయకుల కోరిక మేరకు గత ప్రభుత్వంలో నక్కలకాలువపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు కేటాయించారు. అన్ని అనుమతులు వచ్చే క్రమంలో ప్రభుత్వం మారిపోయింది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కొత్త బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తెరుచుకున్న వెంకటాచలం రైల్వేగేట్



వెంకటాచలం రైల్వేగేటు వద్ద పూర్తయిన పనులు

వెంకటాచలం : మండల కేంద్రమైన వెంకటాచలం నుంచి సర్వేపల్లి వైపు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే గేటును అధికారులు మంగళవారం ఓపెన్ చేశారు. రైల్వేగేటు వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో గత నెల 23వ తేదీ నుంచి రైల్వేగేటుకు మూతవేసి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తి కావడంతో రైల్వేగేటును ఓపెన్ చేశారు. ప్రస్తుతం రాకపోకలు సాగుతున్నాయి.

నరసాపురంలో గ్రాడ్యుయేషన్ డే



ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురంలో ఏసీడీపీఓ ఎం.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు అంగన్‌వాడీ పిల్లలను ఒకటో తరగతికి ప్రమోట్ చేస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను ఒకటో తరగతిలో జాయిన్ చేస్తూ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం ఎస్.మాధవి, సూపర్‌వైజర్ మంజుల, అంగనవాడీ కార్యకర్త పి.జానకీ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

వ్యవసాయ సామగ్రి పంపిణీ

పొదలకూరు : కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన వ్యవసాయ సామగ్రిని మండలంలోని ప్రభగిరిపట్నం ఎస్సీ, ఎస్టీ రైతులకు మంగళవారం అందజేశారు. రూ.10 వేల విలువైన నీటి డ్రమ్ములు, టార్పాలిన్ పట్టాల సామగ్రిని అందించారు. గ్రామానికి చెందిన 30 కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రవీంద్రబాబు, పెంచలయ్య, నర్సయ్య, సులోచన, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదివర్తిలో బడిబాట



విడవలూరు : మండలంలోని ముదివర్తి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.రమణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మూడేళ్లు నిండిన పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాల్సిందిగా కోరారు. ఇక్కడ పిల్లలకు చదువుతో పాటు ఆట పాటలు, పోషకాహారం అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శీనమ్మ, తిరుపతమ్మ, హేమలత, లావణ్య, శారద, సులోచనమ్మ, మహిళా పోలీస్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుంకాళమ్మ తల్లికి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అమ్మవారు

ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో కొలువైన కుంకాళమ్మ తల్లికి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. మేళతాళాల నడుమ ఊరేగుతున్న అమ్మవారికి గ్రామస్తులు కొబ్బరికాయ, కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

ఆత్మీయ సమావేశం

నెల్లూరు సిటీ : కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



కొడవలూరులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

- డిప్యూటీ డీఈఓ రఘురామయ్య

కొడవలూరు : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలని కావలి డిప్యూటీ డీఈఓ రఘురామయ్య సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించి సీఆర్ఎంటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం నుంచే బోధనా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా వంద శాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. విద్యాశాఖలో అమలవుతున్న పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారమే భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థులను చేర్పేందుకు పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. విద్య ద్వారా పిల్లలు బంగారు భవిష్యత్తు పొందవచ్చని చెప్పారు. పిల్లలు డ్రాపౌట్స్‌గా మారకుండా పాఠశాలకు పంపే బాధ్యతను తల్లిదండ్రులే తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న రాయితీల గురించి వివరించారు. ఆయన వెంట ఎంఈఓ జి.వసంతకుమారి, సీఆర్ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, లీలయ్య, వీరాంజనేయులు, శ్రీహరిబాబు ఉన్నారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల



పొదలకూరు : ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న రైతులు

పొదలకూరు : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా నిధుల విడుదల కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులు మంగళవారం వీక్షించారు. 17వ విడతగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారని ఏఓ యు.గీతాకుమారి వెల్లడించారు. రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు కోడూరు భాస్కర్‌రెడ్డి, బక్కయ్యనాయుడు, అడపాల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్మపాళెం ఆర్బీకేలో..

కొడవలూరు : పీఎం కిసాన్ 17వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని మండలంలోని కమ్మపాళెంలో ఉన్న ఆర్బీకేలో వ్యవసాయాధికారులు, రైతులు మంగళవారం వీక్షించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద ఏడాదికి రూ.6 వేలు మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తుండడం తెలిసిందే. మూడోసారి కూడా మోదీ ప్రభుత్వం ఏర్పడడంతో 17వ విడత రూ.2 వేలు విడుదల కార్యక్రమాన్ని వారణాసిలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రైతులను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ప్రసారం చేశారు. ఈ కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షించినట్లు ఏఓ లక్ష్మి తెలిపారు. వీఏఏ ఓ.సుజిత్ ఉన్నారు.

- **విడవలూరు :** పీఎం కిసాన్ నగదు మంగళవారం రైతుల ఖాతాలో జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి పి.వెంకట కృష్ణయ్య అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో 17వ విడత నగదు విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షించినట్లు ఆయన తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ అరుణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల్లో అసాంఘిక కార్యకలాపాలు





పాఠశాల ఆవరణలో మందుబాబుల ఆగడాలు

తోటపల్లిగూడూరు : మండలంలోని పలు ప్రభుత్వ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ భవనాలు, తుఫాన్ షెల్టర్లు ఇలా ప్రతి భవనంలో రోజూ సాయంత్రమైతే చింతపిక్కలాట, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు తెరలేస్తున్నాయి. చీకటి పడితే మందుబాబులకు ఈ ప్రభుత్వ భవనాలు బార్లుగా మారుతున్నాయి. అర్ధరాత్రి వరకు మందుబాబుల విందులు, చిందులతో మారుమోగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో గొడవలు, ఘర్షణలు కూడా జరుగుతున్నాయి. ఉదయం ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయాలకు వచ్చే సమయానికి పేకాట ముక్కలు, మందు సీసాలు, బీరు బాటిళ్లు, సిగరెట్, బీడీ ముక్కలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా కోడూరు, వెంకన్నపాళెం, చిన్నచెరుకూరు, ముంగళదొరువు, ఈదూరు, మండపం, కొత్తపాళెం, వరిగొండ, తోటపల్లిగూడూరు, నరుకూరు, మాచర్లవారిపాళెం గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భవనాల్లో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు జోరుగా సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాల్సి ఉంది.



అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైన చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల పాత భవనం

ప్రసన్నాంజనేయునికి పంచామృతాభిషేకం



విశేషాలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

కొడవలూరు : కొడవలూరులోని ప్రసన్నాంజనేయ స్వామికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం విశేష పంచామృతాభిషేకం, సహస్ర నాగవల్లి దళార్చనలు వేడుకగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి చందనాలంకరణ, పూలంగి సేవలు గావించారు. రాత్రి విశేషాలంకారంతో స్వామివారికి వైభవంగా గ్రామోత్సవం జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కోవూరు వెంకి, పి.రాధాకృష్ణ, కాకాని మురళి, మల్లెల అనిల్, గాలి ప్రసాద్, చంతాటి రవి, ఉయ్యాల నారాయణ, అరగల సుధీర్ బాబు, ముడి హరికృష్ణ, దుంపల కిరణ్ పాల్గొన్నారు.

కార్మికులకు బీసీజీ వ్యాక్సినేషన్



రొయ్యల ఫ్యాక్టరీ కార్మికులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య బృందం

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం గ్రీన్ హౌస్ రొయ్యల ఫ్యాక్టరీ కార్మికులకు కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం బీసీజీ వ్యాక్సిన్ వేశారు. 18 ఏళ్లు నిండిన సుమారు వంద మంది కార్మికులకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులు ఎక్కువగా ఉన్న ఫ్యాక్టరీల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వ్యాక్సినేషన్ చేయడం వల్ల ఎక్కువ మంది సద్వినియోగం చేసుకుంటారన్నారు. అందువల్లే ఫ్యాక్టరీలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. కార్మికులంతా 18 నుంచి 60 ఏళ్లలోపు వారే కావడంతో తగిన జాగ్రత్తలు తీసుకుని వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీబీ వచ్చి తగ్గిపోయిన వారు, మధుమేహ బాధితులు, పొగతాగే వారు, క్షయ రోగితో దగ్గర సంబంధం ఉన్నవారికి వ్యాక్సిన్ వేశామన్నారు. క్షయతో బాధపడుతున్న వారు, గర్భిణులు, పిల్లలకు పాలిచ్చే తల్లులు, హెచ్ఐవీ బాధితులు, కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాక్సిన్ వేయరాదన్నారు. కార్యక్రమంలో హెచ్ఏలు వెంకట్రావు, ఒ.సుధాకర్, ఏఎన్ఎంలు సలోమి, దీనమ్మ పాల్గొన్నారు.